సాక్షి మహబూబ్‌నగర్

ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



హంసవాహనంపై అంజన్న

చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి శనివారం హంస వాహనంపై ఊరేగారు.

వివరాలు 8లో ▸



అదానీ, అంబానీలకే..

కేంద్రం అదానీ, అంబానీలకు దేశ సంపద దోచిపెడుతుందని బీవీ రాఘవులు అన్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.9 /14.9

వాతావరణం

ఉదయం మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

25 నుంచి కోయిల్‌సాగర్ ఆయకట్టుకు సాగునీరు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రస్తుత యాసంగి సీజన్‌కు కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు సాగునీటిని ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 15 వరకు వారాబందీ పద్ధతిలో విడుదల చేయాలని తీర్మానించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ విజయేందిర అధ్యక్షతన సాగునీటి సలహా మండలి నిర్వహించారు. అదేవిధంగా డిస్ట్రిబ్యూటరీ కాల్వలలో పూడిక తీయాలని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సూచించారు. కాల్వల నుంచి మోటార్ల ద్వారా అక్రమంగా నీటిని వాడుకుంటే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ పనులపై చర్చించి.. వెంటనే పూర్తిచేయాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, సాగునీటి ప్రాజెక్టుల సీఈ రమణారెడ్డి, ఎస్ఈ చక్రధర్, కోయిల్‌సాగర్ ఈఈ ప్రతాప్‌సింగ్, మిషన్ భగీరథ ఈఈ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కందులు క్వింటాలు రూ.7,979

జడ్చర్ల/ దేవరకద్ర: బాదేపల్లి మార్కెట్ యార్డులో శనివారం కందులకు క్వింటాలు గరిష్టంగా రూ.7,979, కనిష్టంగా రూ.7,511 ధరలు లభించాయి. అలాగే పత్తి గరిష్టంగా రూ.6,769, కనిష్టంగా రూ.5,510, వేరుశనగ గరిష్టంగా రూ.6,706, కనిష్టంగా రూ.3,690, మొక్కజొన్న గరిష్టంగా రూ.2,423, కనిష్టంగా రూ.2,160, ధాన్యం హంస గరిష్టంగా రూ.2,275, కనిష్టంగా రూ.2,149, ఆర్ఎన్ఆర్ గరిష్టంగా రూ.2,739, కనిష్టంగా రూ.2,311, సోనామసూరి రూ.2,125 చొప్పున పలికాయి.

శ్రీరామ్ గోల్డ్ ధర రూ.2,802

దేవరకద్ర మార్కెట్ యార్డులో శనివారం జరిగిన టెండర్లలో శ్రీరామ్ గోల్డ్ ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,802 ఒకే ధర లభించింది. ఆర్ఎన్ఆర్ ధాన్యం గరిష్టంగా రూ.2,672, కనిష్టంగా రూ.2,459, కందులు క్వింటాల్ గరిష్టంగా రూ.9,251, కనిష్టంగా రూ.9,131 చొప్పున వచ్చాయి.

రెండు రోజులు సెలవు..

దేవరకద్ర మార్కెట్‌కు వరుసగా రెండు రోజులు సెలవు ఇచ్చారు. ఆదివారం సాధారణ సెలవు కాగా.. సోమవారం చిన్నరాజమూర్ జాతర సందర్భంగా సెలవు ఇచ్చారు. తిరిగి మంగళవారం మార్కెట్‌లో లావాదేవీలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

‘523 బాధితులకు న్యాయం చేయాలి’



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాకేంద్రంలోని క్రిష్టియన్‌పల్లి సర్వే నం.523లో ప్లాట్లు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని 523 నిర్వాసితుల కమిటీ సలహాదారుడు రాంమోహన్ బాధితులతో కలిసి శనివారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004, 2012 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం సర్వే నం.523లో పేదలకు పట్టాలు ఇచ్చిందన్నారు. అయితే 2018 సంవత్సరంలో ఇంటి స్థలం పట్టాలు ఇస్తే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి తమ వద్ద ఉన్న ఒరిజినల్ పట్టాలు తీసుకొని రశీదులు ఇచ్చారన్నారు. అయితే ఇప్పటికీ డబుల్ బెడ్‌రూంలు ఇవ్వలేదని, ఇటు స్థలాలు కోల్పోయి వీధినపడ్డామని వాపోయారు. ఇందిరమ్మ పథకంలో భాగంగా మొదట తమకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో 523 నిర్వాసితుల కమిటీ అధ్యక్షురాలు పార్వతమ్మ, గౌరవాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి మంగమ్మ, అనురాధ పాల్గొన్నారు.

నోరూరేలా..!

చేప వంటకాలకు అడ్డాగా జూరాల ఎడమ కాల్వ

- అంతర్రాష్ట్ర పర్యాటకులను ఆకర్షిస్తున్న ఘుమఘుమలు
- కేవలం చేప ఫ్రై, కర్రీ రెండు రకాలతోనే వంటకాలు
- వారాంతాల్లో యువకుల సందడి
- ఉపాధి పొందుతున్న వందలాది మత్స్యకారులు



ఎడమ కాల్వ వద్ద కిటకిటలాడుతున్న చేపలు వండే ప్రాంతం (ఫైల్)



చేప కర్రీ చేస్తున్న మత్స్యకారుడు

సండే స్పెషల్

జూరాల చేప వంటల తయారీకి పేరుగాంచింది. 25 సంవత్సరాలుగా ప్రాజెక్టు సమీపంలోని నందిమళ్ల గ్రామానికి చెందిన మత్స్యకారులతోపాటు ఇతరులు చేపల విక్రయాలు, వాటి వంటకాల తయారీపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. దీంతో ఇక్కడ దొరికే చేప వంటకాల కోసం ఉమ్మడి జిల్లాతోపాటు హైదరాబాద్, సమీపంలోని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి పర్యాటకులు, యువకులు తరలివస్తుంటారు. వానాకాలంలో ఎగువ నుంచి జూరాల ప్రాజెక్టుకు వరద వస్తుండటంతో కృష్ణమ్మ పరవళ్లను వీక్షించడంతోపాటు ఇక్కడ వండే చేప వంటకాల కోసం ఆసక్తి చూపిస్తారు. అప్పటికప్పుడే పట్టుకున్న చేపలను జాలర్లు విక్రయిస్తుండటంతో నేరుగా కొనుగోలు చేసి వాటిని తమ రుచికి అనుగుణంగా వండమంటూ అక్కడే గుడారాలు ఏర్పాటు చేసుకున్న వారికి ఇస్తూ కడుపార ఆరగించి.. సాయంత్రం వరకు జూరాల అందాలను చూస్తూ సరదాగా గడుపుతారు.

చేప ఫ్రై.. చేప పులుసు వంటకాలకు అడ్డాగా మారింది జూరాల ఎడమ కాల్వ. ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న గుడిసెలు.. వాటి ముందు వంటలు చేసేందుకు ఏర్పాటు చేసుకున్న కట్టెల పొయ్యిలపై చేసిన చేప వంటకాలతో ఆ పరిసరాలు ఘుమఘుమలాడుతాయి. ఇక్కడి చేప వంటలను రుచిచూసిన ప్రతిఒక్కరు.. మరోమారు కుటుంబ సభ్యులతో కలిసి రావాలని ఆశపడతారనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. మామూలు రోజుల్లో పదుల సంఖ్యల్లో, వారాంతాల్లో వందలాదిగా ఉండే పర్యాటకుల సంఖ్య.. జూరాలకు వరదలు వచ్చే సమయంలో వేలకు చేరుతుంది. ఆ సమయంలో గంటల తరబడి వేచిచూసి మరీ చేప వంటకాలను రుచిచూస్తారు.

– అమరచింత

ఇక్కడ దొరికే చేపలు..

జూరాల ప్రాజెక్టు వద్ద దూబొచ్చ, రావులు, బొచ్చ, కొరమీనుతోపాటు బంగారు తీగలు విరివిగా లభిస్తాయి. వీటిలో ఫ్రైతోపాటు కూర కోసం దూబొచ్చ, బొచ్చ రకాల చేపలనే అత్యధికంగా ఇష్టపడి కొనుగోలు చేస్తుంటారు. సాధారణ రోజుల్లో కిలో చేపలు రూ.120 – 150 వరకు విక్రయిస్తారు. కొనుగోలు చేసిన చేపలను శుభ్రంగా కడిగి.. కోయడానికి కిలో రూ.20 చొప్పున వసూలు చేస్తారు. ఆ తర్వాత కిలో చేపలు వండటానికి, ఫ్రై చేయడానికి అయినా రూ.వంద చొప్పున తీసుకుంటారు. ఇక వరదలు వచ్చే సమయంలో అయితే ఈ ధరలు ఇంకాస్త పెరుగుతాయి.



చేప ఫ్రై చేస్తున్న మహిళ

అనునిత్యం రద్దీ..

జూరాల ఎడమ కాల్వ వద్ద చేప వంటకాల కోసం ప్రజలు వస్తుండటంతో ఆ ప్రాంతమంతా నిత్యం జనంతో కిటకిటలాడుతూ కనిపిస్తుంది. వీటికితోడు నందిమళ్ల గ్రామానికి చెందిన సుమారు 300 మత్స్యకార కుటుంబాలు, వంటకాలు తయారు చేసే కుటుంబాలకు చెందినవారు అన్ని సమయాల్లోనూ ఇక్కడే ఉంటారు. జూరాలకు వరదలు వచ్చిన సమయంలో ఏడాది సంపాదన వెనకేసుకుంటారని వినికిడి.

రుచికరంగా వండిస్తున్నాం..



పర్యాటకులతో పాటు ప్రజలకు నచ్చే విధంగా, వారికి ఎలాంటి రుచి కావాలో అలాంటి రుచి వచ్చే విధంగా చేప వంటలను తయారు చేసి ఇస్తున్నాం. గత ఏడేళ్లుగా చేప వంటలను తయారుచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా.

– ఖాజామైనొద్దీన్, చేపవంటల తయారీదారుడు

ఇదే జీవనోపాధి..



ఇక్కడ చేపలు కొన్న వ్యక్తుల నుంచి వాటిని తీసుకుని శుభ్రంగా కడిగి, కొయ్యడమే ప్రధాన పని. కిలో చేపలను కొయ్యడానికి రూ. 20 తీసుకుంటున్నాం. ఇలా రోజువారీగా రూ. 300 నుంచి రూ. 500 వరకు సంపాదించుకుంటున్నా.

– అలివేల, మత్స్యకారురాలు, నందిమళ్ల

రుచి బాగుంటుంది..



మేము ప్రతి సీజన్‌లో చెరుకు కోతలకు వస్తుంటాం. గత తొమ్మిదేళ్లుగా క్రమం తప్పకుండా ఇక్కడికి పిల్లాపాపలతో వచ్చి చేప వంటలను ఆరగిస్తుంటాం. ఇంట్లో తయారు చేసుకుంటే వచ్చే రుచికన్నా ఇక్కడ అప్పటికప్పుడు తయారు చేసి ఇచ్చిన చేపకూర రుచి ఎంతో అనుభూతిని ఇస్తుంది.

– పిచ్చయ్య, ఎర్రగొండపాలెం, ప్రకాశం జిల్లా

ఒక్కడినే కిలో చేపలు తింటా..



ఇక్కడ చేప వంటలు అతి రుచిగా ఉంటున్నాయి. దీంతో ప్రాజెక్టుకు వచ్చినప్పుడల్లా ఒక్కడినే కిలో చేపలు తీసుకుని ఫ్రై చేయించుకుని తినడం అలవాటు. వీలు దొరికినప్పుడల్లా ఇలా వచ్చి, కడుపార చేప మాంసం ఆరగించడం అలవాటయ్యింది.


– మరిదాస్, ప్రకాశం జిల్లా

వీకెండ్‌లో తప్పనిసరి..



ప్రతి వీకెండ్‌లో జూరాల ప్రాజెక్టుకు స్నేహితులతో కలిసి వస్తుంటా. సరదాగా ప్రాజెక్టు పరిసరాలు చూడటం.. ఇక్కడ దొరికే చేపలను కొనుగోలు చేసి వాటిని వండించుకుని తినడం ఎంతో ఆనందం కలుగుతుంది. ఇలా ఎప్పుడు పడితే అప్పుడు కాకుండా వీకెండ్‌లో ఎంజాయ్ కోసం ఇక్కడికి వస్తుంటాం.

– రాజేందర్, మహబూబ్‌నగర్



జూరాల ప్రాజెక్టు దిగువన పర్యాటకులు (ఫైల్)



చేప వంటకాలు ఆరగిస్తున్న యువకులు (ఫైల్)

చేపకూర బాగుంటుందని వచ్చా..



మాది హైదరాబాద్. ఇక్కడ పెళ్లి పనుల కోసం వచ్చాం. సమీపంలోని జూరాల వద్ద చేప వంటలు మంచి రుచిగా ఉంటాయని బంధువులు చెప్పడంతో పిల్లాపాపలతో కలిసి వచ్చాం. నదిలోంచి అప్పుడే పట్టిన చేపలను అమ్మడం.. అక్కడే వాటిని వండే హోటళ్లు ఉండటంతో కుటుంబమంతా కలిసి చేప వంటకాలను తినేందుకు వచ్చాం.

– రాములు, హైదరాబాద్

లోక్ అదాలత్‌లో 14,630 కేసులు రాజీ

- బాధితులకు నష్టపరిహారం చెక్కులు అందించిన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి

పాలమూరు: జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ కావడం శాశ్వత మార్గం లభించినట్లేనని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి అన్నారు. జిల్లా కోర్టులో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్‌ను న్యాయమూర్తి ప్రారంభించి మాట్లాడారు. దీర్ఘకాలికంగా కేసులు పెండింగ్‌లో ఉండటం వల్ల కక్ష్యిదారులు ఇబ్బందులు పడుతారని, రాజీ చేసుకోవడం వల్ల శాశ్వత మార్గం లభిస్తుందని చెప్పారు. జాతీయ లోక్ అదాలత్‌లో అధికంగా కేసులు రాజీ కావడానికి పోలీస్ శాఖతోపాటు అన్ని రకాల బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు సహకరించాయని చెప్పారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శ్రీదేవి, రాజరాజేశ్వరి, ఇందిర, రాధిక, మమతారెడ్డి, నిహారిక, భావన, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బార్ అసోసియేషన్ కార్యదర్శి, న్యాయవాదులు, అన్ని బ్యాంకుల సిబ్బంది పాల్గొన్నారు.

■ జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేయడానికి ఐదు బెంచీలు, జడ్చర్లలో ఒక బెంచీ ఏర్పాటు చేసి.. మొత్తం 14,630 కేసులు రాజీ కుదిర్చారు. మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులో కక్ష్యిదారులకు నష్ట పరిహారం కింద చోళ మండలం జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి బాధితులకు రూ.20 లక్షల చెక్కు అందించారు. 2018లో నమోదైన సివిల్ కేసులో భూ తగాదాల మధ్య కుటుంబ సభ్యుల్లో అక్క, తమ్ముళ్లకు మధ్య ఉన్న వివాదం పరిష్కరించి రాజీ చేశారు.

కాంగ్రెస్ నేతల హాజరు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ నేతలపై నమోదైన కేసు రాజీలో భాగంగా శనివారం జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. ఇందులో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, నాయకులు ఎన్పీ వెంకటేష్, సుందర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి బి.పాపిరెడ్డి

2,373 పోలీస్ కేసులు పరిష్కారం

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పోలీస్ శాఖ నుంచి మొత్తం 2,373 కేసులు పరిష్కారం అయ్యాయని ఎస్పీ జానకి తెలిపారు. పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదై అండర్ విచారణతో పాటు కోర్టు విచారణలో ఉన్న 243 ఐపీసీ కేసులు, డ్రంకెన్‌డ్రైవ్, ఎంవీఐ యాక్ట్, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 293 కేసులు 293, ఈ–పెట్టి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన కేసులు 1,834 కేసులు రాజీ అయ్యాయన్నారు. గత 15 రోజుల నుంచి పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది కేసులలో ఉన్న కక్ష్యిదారులను నేరుగా కలిసి రాజీమార్గంపై అవగాహన కల్పించి లోక్ అదాలత్‌కు తీసుకువచ్చారన్నారు. త్వరలో కోర్టు సిబ్బంది, మానిటరింగ్ చేసిన సీపీలకు రివార్డ్స్ అందజేస్తామని వెల్లడించారు.

ఉద్యోగుల హక్కులను సాధించుకుందాం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఐక్యంగా ఉండి ఉద్యోగుల హక్కులను సాధించుకుందామని టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన టీజీఓ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రజా ప్రభుత్వంలో ఉద్యోగుల పాత్ర కీలకమని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని చెప్పారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అంతకుముందు పిస్తా హౌస్ నుంచి బస్టాండ్ వరకు మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

జిల్లా అధ్యక్షుడిగా విజయ్‌కుమార్

టీజీఓ జిల్లా అధ్యక్షుడిగా విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శిగా వరప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడిగా రవీందర్, ఉపాధ్యక్షులుగా శ్రీనుగౌడ్, రాంపాల్, మహిళా ఉపాధ్యక్షురాలిగా సంధ్య, సహ కార్యదర్శులుగా మురళిధర్, నరేష్‌కుమార్, మహిళా సహ కార్యదర్శిగా స్వాతి, కోశాధికారిగా టైటస్‌పాల్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గంగాధర్, ప్రచార కార్యదర్శిగా జగదీష్‌కుమార్, కార్యాలయ కార్యదర్శిగా జగన్‌మోహన్‌రెడ్డి, సాంస్కృతిక కార్యదర్శిగా వీరారెడ్డి, క్రీడల కార్యదర్శిగా రాజు, కార్యనిర్వాహక సభ్యులుగా శ్రీనివాసులు, నాగరాజు, ఇమ్రాన్‌ఖాన్, చంద్రకళ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. అనంతరం నూతన కమిటీ కలెక్టర్‌ను కలిశారు.



సర్వం సిద్ధం

- నేడు, రేపు గ్రూప్–2 పరీక్షల నిర్వహణ
- జిల్లాలో 54 కేంద్రాలు.. హాజరుకానున్న 20,581 మంది అభ్యర్థులు
- అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం
- అరగంట ముందే గేట్‌కు తాళం



జిల్లాకేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాల సెంటర్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలో గ్రూప్–2 పరీక్షల నిర్వహణకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఆది, సోమవారాల్లో జరిగే పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. తెలంగాణ పబ్లిక్ కమిషన్ ఆదేశాల మేరకు కలెక్టర్ విజయేందిర అధికారులకు మార్గదర్శకాలు సూచించడంతోపాటు నిర్వహణపై సమీక్షించారు. ఉదయం 10 నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు జరగనున్నాయి. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా 54 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 20,581 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్లు ఈ నెల 9 నుంచే డౌన్‌లోడ్ చేసుకోవడానికి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అయితే అభ్యర్థులు ఉదయం సెషన్ కోసం 8.30 నుంచి, మధ్యాహ్నం సెషన్ కోసం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిసారు. ఉదయం నిర్వహించే పరీక్ష సెషన్ కోసం ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్ కోసం 2.30 గంటలకు పరీక్ష కేంద్రం గేట్లు మూసివేస్తారు. గేట్లు మూసి వేసిన తర్వాత అభ్యర్థులెవరినీ లోపలికి అనుమతించరు.

మొత్తం 4 పేపర్లు..

గ్రూప్–2 పరీక్షలో మొత్తం 4 పేపర్లు ఉన్నాయి. ఇందులో మొదటి రోజు ఆదివారం ఉదయం పేపర్–1లో జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీ, మధ్యాహ్నం పేపర్–2లో చరిత్ర, పాలిటీ, సొసైటీ అంశాలు ఉంటాయి. రెండోరోజు సోమవారం ఉదయం పేపర్–3లో ఎకానమి, డెవలప్‌మెంట్, మధ్యాహ్నం పేపర్–4లో తెలంగాణ ఉద్యమం, రాష్ట్రం ఏర్పాటు అంశాలపై పరీక్ష ఉంటుంది. ఇందుకోసం జిల్లాకేంద్రంలో 52 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని జేపీఎన్‌సీఈ, దేవరకద్రలోని స్విట్స్ కళాశాలలో కేంద్రాలను ఏర్పాటు చేశారు.

■ పరీక్ష నిర్వహణ కోసం ఇద్దరు రీజినల్ కోఆర్డినేటర్లు, 10 మంది రూట్, 10 మంది జాయింట్ రూట్ ఆఫీసర్లు, 54 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 10 మంది ఫ్లయింగ్ స్క్వాడ్, 228 మంది ఐడెంటిఫికేషన్ సిబ్బంది, పోలీస్ నోడల్ ఆఫీసర్ ఒకరు, జాయింట్ కస్టోడియన్ ఆఫీసర్లు ఇద్దరిని నియమించారు. పరీక్షా కేంద్రాలుగా గుర్తించిన విద్యాసంస్థలకు ప్రభుత్వం సోమవారం సైతం సెలవు ప్రకటించింది.

పలు దశల్లో శిక్షణ..

గ్రూప్–2 పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ప్రశ్నపత్రాలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంల వద్ద ప్రత్యేక భద్రత కల్పించారు. చీఫ్ సూపరింటెండెంట్లు పరీక్షలకు ఒక రోజు ముందు కేంద్రాలను పరిశీలించి అన్ని రకాల వసతులు, భద్రతపై సూచనలు చేశారు. చీఫ్ సూపరింటెండెంట్ మినహా మిగిలిన వారెవరి మొబైల్ ఫోన్‌ను అనుమతించరు. అంతేకాక సిబ్బందితోపాటు అభ్యర్థులను క్షుణ్ణంగా పరీక్షించాకే లోపలికి పంపిస్తారు. కాగా అబ్జర్వర్లు, రూట్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లకు పలు దశల్లో శిక్షణ ఇచ్చారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు...

జిల్లాలో రెండు రోజులపాటు గ్రూప్–2 పరీక్షలు జరుగుతాయి. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎలాంటి అవకతవకలు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం.

– శివేంద్రప్రతాప్, అదనపు కలెక్టర్

ప్రత్యేక ఆంక్షలు అమలు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో నిర్వహిస్తున్న గ్రూప్– 2 పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్ఎస్ అమల్లో ఉంటుందని ఎస్పీ జానకి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండురోజులపాటు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష కేంద్రాల దగ్గర ప్రత్యేక ఆంక్షలు అమలులో ఉంటాయని, పరీక్ష సమయంలో పరిసర ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సెంటర్లు, జిరాక్స్, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా పోలీసులు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. పరీక్ష సమయంలో ఎలాంటి ఆటంకాలు ఎదురవకుండా పోలీస్ పెట్రోలింగ్ టీంలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాలు పూర్తిగా పోలీస్ నిఘాలో ఉంటాయని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చదువు, ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపుతో విద్యార్థులకు మేలు
- కామన్ డైట్ మెనూ ప్రారంభంలో కలెక్టర్ విజయేందిర



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ విజయేందిర

జడ్చర్ల టౌన్: విద్యార్థులు శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టిపెడతారని, అందుకే వీటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని కలెక్టర్ విజయేందిర అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు, కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవంలో భాగంగా కావేరమ్మపేట మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి తరగతి గదిని తనిఖీ చేసి.. విద్యార్థులతో మాట్లాడుతూ ముందుకు సాగారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యల గురించి ఆరాతీశారు. అలాగే డార్మెంటరీ, వంట గది, వంట సామగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా వేడి నీళ్లు, ఆడుకోవడానికి మైదానం కావాలని విద్యార్థులు కలెక్టర్‌ను కోరారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కామన్ డైట్ మెనూ చార్ట్‌ను ప్రారంభించి.. పుస్తకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి అభినందించారు. విద్యార్థినులతో కలిసి కేక్ కట్ చేసి.. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. అంతకుముందు ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. జిల్లాలోని 87 గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో డైట్ చార్జీల పెంపు, కామన్ మెనూ అమలు చేస్తున్నామన్నారు. విద్యార్థుల ఇష్టాలకు తగ్గట్టుగా కొత్త మెనూ రూపొందించారని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని జీవితం ఉన్నత స్థితికి చేరేందుకు లక్ష్యం నిర్దేశించుకోవాలని విద్యార్థులకు సూచించారు. వచ్చే పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని చెప్పారు. క్రీడా స్టేడియం ఇతర సౌకర్యాలతో జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని, బాలానగర్ మండలం పెద్దాయపల్లి, చిన్నచింతకుంట మండలం దమగ్నపూర్‌లో శంకుస్థాపన చేశామన్నారు.

గీజర్ అందించిన ఎమ్మెల్యే

విద్యార్థుల సౌకర్యార్థం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సమకూర్చిన నాలుగు వేడి నీటి గీజర్లను శనివారం కాంగ్రెస్ నాయకులు కలెక్టర్ ద్వారా పాఠశాలకు అందజేశారు. గీజర్లు వచ్చినందున వేడి నీటి సమస్య తీరుతుందని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కల్పన, డీఆర్‌డీఓ జోజప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, వైస్ చైర్‌పర్సన్ సారిక, కౌన్సిలర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాహనం ఢీకొని మహిళ దుర్మరణం

గద్వాల క్రైం: గుర్తు తెలియని వాహనం ఢీ కొని మహిళ (45)దుర్మరణం చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ వివరాల ప్రకారం.. శనివారం ఉదయం గద్వాల –అయిజ రోడ్డు మార్గంలో గుర్తు తెలియని వాహనం రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని మహిళను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాసుపత్రి మార్చ్యూరీకి తరలించారు. మహిళకు సంబంధించిన బంధువులు ఎవరైనా ఉంటే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

హన్వాడ: మండలంలోని అత్యకుంటతండాకు చెందిన సభావత్ రవినాయక్(26) శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. వివరాలు.. రవినాయక్ కొంత కాలంగా ఫిడ్స్‌తో బాధపడేవాడు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య సభావత్ భారతి శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అయిజ: ఈనెల 9వ తేదీన పురుగుమందు తాగిన భార్గవ్ (34) గద్వాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శనివారం మృతిచెందాడు. కుటుంబ కలహాలతో భార్యాభర్తలు భార్గవ్, పల్లవి ఈనెల 9న నంద్యాల జిల్లా యాగంటి దేవస్థానం సమీపంలో పురుగుమందు తాగాడు. అక్కడున్న ప్రజలు గమనించి పోలీసులకు సమాచారమివ్వగా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్గవ్‌ను మూడురోజుల క్రితం గద్వాల జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సపొందుతూ భార్గవ్ శనివారం మృతిచెందాడు. ఆయన భార్య పల్లవి హైదరబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. భార్గవ్ మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతుడికి ఆరేళ్ల కూతురు ఉంది.

మహమ్మదాబాద్‌లో..

మహమ్మదాబాద్: ఇంటిబయట పడుకున్న వ్యక్తి కుక్కకాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మహమ్మదాబాద్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన కాశిమయాన్(42) మురుకుల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గత నెల 10న రాత్రి ఇంటి ముందు నిద్రిస్తుండగా కుక్కకాటుకు గురయ్యాడు. స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించుకున్నాడు. తగ్గక పిచ్చిచేష్టలు చేస్తుండటంతో ఈ నెల 13న మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబీకుడు వీరప్రతాప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.

హన్వాడ: మండలంలోని పాచర్లతండాకు చెందిన పాత్లావత్ కిషన్‌నాయక్(56) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. ఈనెల 12న కిషన్‌నాయక్ బైక్‌పై పాచర్లతండా నుంచి హన్వాడకు వస్తున్నాడు. ఈక్రమంలో అమ్మాపూర్‌కు సమీపంలో బైక్‌పై ఎదురుగా వస్తున్న వ్యక్తి ఢీకొట్టాడు. దీంతో కిషన్‌నాయక్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో క్షతగాత్రుడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అనారోగ్యంతో యువతి మృతి



నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందేందుకు వచ్చి అస్వస్థతకు గురై ఆస్పత్రి ఆవరణలో యువతి మృతిచెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. తాడూరు మండలం, ఇంద్రకల్ గ్రామానికి చెందిన బాలరాజు, వెంకటమ్మల కుమార్తె జ్యోతి (30) కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి రాగా యువతిని వైద్యులు పరీక్షించారు. పరిస్థితి బాగాలేదని ఇతర ఆస్పత్రికి వెళ్లాలని బాధిత కుటుంబసభ్యులకు సూచించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో యువతిని కాపాడేందుకు ఆక్సిజన్ పెట్టి మందులు రాసి ఇచ్చారు. కొంత సమయానికి మందులు వేసి యువతిని ఇంటికి తీసుకెళ్తుండగా అకస్మాత్తుగా ఆస్పత్రి గేట్ వద్ద కుప్పకూలి మృతిచెందింది. దీంతో మృతదేహంతో బాధిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. సమాచారం అందుకున్న పోలీసులు బాధిత కుటుంబసభ్యులను సముదాయించి శాంతింపజేశారు.

అదానీ, అంబానీలకే దేశ సంపద

- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

అచ్చంపేట: కేంద్ర ప్రభుత్వం అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతుందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. అచ్చంపేటలో శనివారం నిర్వహించిన సీపీఎం జిల్లా మూడో మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల పక్షాన నిలబడుతుందని, ఒక అదానీకే రూ.16 వేల కోట్లు కట్టబెట్టిందని ఆరోపించారు. పేదవాడు తిండి కోసం నానా తిప్పలు పడుతుంటే.. పెట్టుబడిదారులు, భూస్వాములు రోజురోజుకు సంపన్నులుగా మారుతున్నారన్నారు. దేశంలో బీజేపీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ మనుధర్మశాస్త్రాన్ని అమలు చేసే ప్రయత్నం చేస్తోందన్నారు. బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండాను అమలు చేసేందుకు ఉందే తప్ప పేదల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. యూనివర్సిటీలు, జడ్జిల నియామకాల్లోనూ ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ తలదూరుస్తోందని, జడ్జిలు వెళ్లి ఆర్‌ఎస్‌ఎస్ సమావేశంలో పాల్గొనడమే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాటలతో డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని, ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. పార్టీలు ప్రజల పక్షాన పోరాడాల్సింది పోయి రాజకీయ విమర్శలకు పరిమితం అవుతున్నాయని ఎద్దేవా చేశారు. బీజేపీ మతోన్మాద చర్యలు, బీఆర్‌ఎస్ అధికార దాహంతో చేసే చర్యలను తెలంగాణలో సాగనివ్వమని చెప్పారు.



సీపీఎం జిల్లా మహాసభలో ఐక్యత చాటుతున్న బీవీ రాఘవులు తదితరులు

మద్దతు ధర కోసం ప్రత్యేక చట్టం

రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సాగర్ మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధర అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు రుణ విమోచన చట్టం అమలు చేయాలని, రాజ్యాంగం ప్రకారం అన్ని రాష్ట్రాలకు సమానంగా నిధులు కేటాయించాలన్నారు. కేంద్రం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని రైతులు ఢిల్లీలో నిరసన తెలిపితే 750 మంది రైతులను బలిగొన్నారన్నారు. రైతులు చనిపోతే కానీ కేంద్రం స్పందించలేదని, పంటల మద్దతు ధర కోసం దేశవ్యాప్తంగా రైతు సంఘాలు పోరాటాలు చేస్తున్నాయని గుర్తుచేశారు. పన్నుల ద్వారా వసూలైన 18 శాతం నిధులను తిరిగి రాష్ట్రాలకు చెల్లించేలా ఎంపీలు కృషి చేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు పర్వతాలు, కిల్లె గోపాల్, గీత, శ్రీను, దేశ్యానాయక్, మల్లేష్, శంకర్‌నాయక్, రాములు, సైదులు, నిర్మల పాల్గొన్నారు.

అభిమానంతోనే వచ్చా..

ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ భూమి మీద ప్రజలు ఉన్నంత కాలం ఎర్రజెండా ఉంటుందని, విద్యార్థి దశలోనే ఎస్‌ఎఫ్‌ఐతో నా ప్రయాణం మొదలైందన్నారు. కమ్యూనిటిస్టుపై ఉన్న అభిమానంతో ఈ సమావేశానికి వచ్చానని, మారుతున్న కాలానికి అనుగుణంగా వేరే పార్టీలోకి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. దేశంలో ప్రధానంగా విద్య, వైద్యం పేదలకు అందించేలా చట్టాలు తేవాలని, ఇందు కోసం కమ్యూనిస్టులు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. భవిష్యత్‌లో పేదలకు ఎర్రజెండా మాత్రమే అండగా నిలబడుతుందని భావిస్తున్నట్లు చెప్పారు. కమూనిజంపై పాటలు పాడి ఉర్రూతలూగించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోరంటి వెంకన్న

పాలమూరు జనరల్ ఆస్పత్రిలో వాహనాలకు పాస్ విధానం

- దొంగతనాల కట్టడికి చర్యలు
- సీఐ ఇజాజుద్దీన్

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా జనరల్ ఆస్పత్రిలో ద్విచక్ర వాహనాలతో పాటు నాలుగు చక్రాల వాహనాల దొంగతనాలు కట్టడికోసం పాస్ విధానం అమల్లోకి తీసుకొస్తున్నట్లు టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ అన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక పాస్ విధానాన్ని శనివారం టూటౌన్ సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు బైక్‌లకు తప్పక హ్యాండిల్ లాక్ వేసుకోవాలని, పాత లాక్ విధానం ఉంటే మార్చుకోవాలన్నారు. కొత్తగా అమల్లోకి తెచ్చిన విధానం వల్ల ఆస్పత్రి లోపలికి వచ్చే ప్రతి వాహనం నెంబర్‌తో పాటు వాహనదారుడి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేసుకుని పాస్ ఇస్తారని తెలిపారు. కొంత మంది బస్టాండ్‌లో పార్కింగ్‌లో కాకుండా పరిసర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు పెట్టి వెళ్తుంటారని, ఇలా చేయరాదన్నారు. ఇలా పెట్టడం వల్లే దొంగతనాలు అవుతుంటాయని తప్పక పార్కింగ్‌లో పెట్టి రశీదు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రిలో చిన్న పిల్లల కిడ్నాప్‌లతో పాటు ఇతర దొంగతనాల కట్టడికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ విజయ్ భాస్కర్, ఆర్‌ఎంఓ దుర్గా, రాములు నాయక్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

లౌకికత్వమే మన జీవన విధానం



మాట్లాడుతున్న ప్రముఖ రచయిత కల్లూరి భాస్కరం

స్టేషన్ మహబూబ్‌నగర్: దేశంలోని అన్ని మతాలు, వర్గాలు, జాతులకు సమాన స్వేచ్ఛనిచ్చే లౌకికత్వమే మనందరి జీవన విధానం అని ప్రముఖ రచయిత కల్లూరి భాస్కరం అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం తొలి రాష్ట్ర మహాసభ నిర్వహించారు. ప్రారంభ సభలో కల్లూరి భాస్కరం లౌకిక ప్రజాస్వామిక జీవన సంస్కృతి– సాహిత్యంపై ప్రసంగించారు. దేశ రూపాంతరం, 110 ఏళ్ల సహజీవన సంస్కృతి భారతదేశాన్ని చల్లని గాలిలా తడిమిందన్నారు. ఆ జీవన సంస్కృతిపై వందేళ్లుగా విద్వేషాల సంస్కృతి ఓడిపోతూ ఇప్పుడు పైచేయిని సాధించిందన్నారు. ఈ దేశ సహజమైన స్వభావం సామరస్యమని, దీనిని విధ్వంసం చేయడం అనేక ప్రక్రియ పాలకుల నుంచే ప్రారంభమైందని తెలిపారు. అనంతరం 'బహుళ అస్తిత్వాలు– సాంస్కృతిక జాతీయవాద సవాళ్లు' అనే అంశంపై ప్రొఫెసర్ చింతకింది కాశీం ప్రసంగించారు. భారతదేశం బహుళ సంస్కృతి, దేవతల సంగమం అన్నారు. ఒకే మతం, ఒకే దేశం, ఒకే చట్టం, పన్ను పేరుతో బ్రాహ్మణ వైదిక ధర్మం బహుజనులపై తమ ఆధిపత్యాన్ని కొనసాగించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దేశంలో ఉత్పన్నమయ్యే ఈ సమస్యకు ఇక్కడి సంస్కృతి, చరిత్రలోనే పరిష్కారం ఉందన్నారు. కవి షైక్‌బాబా మాట్లాడుతూ వేలాది ఏళ్లుగా పీడితులుగా వివక్షకు గురైన కులాలు ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. 50 శాతానికిపైగా ఉన్న సామాజిక వర్గం రాజ్యాధికారానికి దూరంగా ఉండి చైతన్యవంతంగా సమాజానికి నాయకత్వం వహించకపోవడం విచారకరమన్నారు. ప్రొఫెసర్ కాత్యాయని విద్మహి మాట్లాడుతూ లౌకిక ప్రజాస్వామ్యమే నేటి సాహిత్యకారుల కర్తవ్యం అన్నారు. పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి మాట్లాడుతూ బహుళ జాతి కంపెనీలు, ప్రపంచ పెట్టుబడిదారులు మత విద్వేషాలు రెచ్చగొట్టడం ద్వారా తమ దోపిడిని కొనసాగించాలని కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో 33 మంది వక్తలు ప్రసంగించగా 20 మంది కవులు తమ కవితాగానం వినిపించారు. కార్యక్రమంలో టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మెట్టు రవీందర్, గుడిపల్లి నిరంజన్, మెర్సి మార్గరెట్, ఏకే ప్రభాకర్, కె.లక్ష్మణ్‌గౌడ్, కస్తూరి ప్రభాకర్, ఇక్బాల్‌పాష, సతీష్‌రెడ్డి, ఉదయమిత్ర, వామన్‌కుమార్, గూడూరు మనోజ, హైమావతి, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, ఎస్‌ఎం ఖలీల్, వనపట్ల సుబ్బయ్య, హనీఫ్ అహ్మద్, జగపతిరావు తదితరులు పాల్గొన్నారు.



సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం సభలో పాల్గొన్న ప్రజలు

పంప్‌మోడ్ పద్ధతిలో 8,551 క్యూసెక్కులు తరలింపు

దోమలపెంట: భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో 24 గంటల వ్యవధిలో శ్రీశైలం ఆనకట్ట దిగువన సాగర్ జలాశయం నుంచి ఆనకట్ట ఎగువన శ్రీశైలం జలాశయంలోకి 8,551 క్యూసెక్కుల నీటిని (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,526, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 2.432 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. శనివారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 863.8అడుగుల వద్ద 118.0544 టీఎంసీల నీటి నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

భూగర్భ కేంద్రాన్ని సందర్శించిన పాలకుర్తి ఎమ్మెల్యే

దోమలపెంట: పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఆదివారం భూగర్భ విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. శ్రీశైలం సందర్శనకు కుటుంబంతో వచ్చిన ఆమె తిరుగు ప్రయాణంలో భూగర్భ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రంలో షిఫ్టు విధుల్లో ఉన్న ఇంజినీర్లు ఆమెకు సాధారంగా స్వాగతం పలికి కేంద్రం పనితీరును వివరించారు. దోమలపెంట కాంగ్రెస్ అధ్యక్షుడు కె.మోయిజ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు గురువయ్య, సిరాజ్, రవి, రసూల్, దత్తు, ఇజాజ్ అహ్మద్ తదితరులు ఎమ్మెల్యేను సత్కరించారు. విద్యుత్ కేంద్రం ఎంతో బాగుందని, తెలంగాణ రాష్ట్రానికి ఆధునిక దేవాలయంగా ఆమె కొనియాడారు.

హంసవాహనంపై ఊరేగిన అంజన్న

దేవరకద్ర: చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారిని హంస వాహనంపై ఊరేగించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకారంతో పూజలు నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున అశ్వవాహన సేవ ప్రభోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లనుచేశారు. సోమవారం రథోత్సవం ఉండడంతో భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యే అవకాశముంది. ఇప్పటికే జాతర మైదానంలో గుడారాలు వెలిశాయి.

అఖండ భజనలు..

మండల కేంద్రంలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం ఘనంగా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. దేవాలయంలో అఖండ భజనలు చేశారు. ఆదివారం తెల్లవారుజామున స్వామివారి రథోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లను చేశారు.



హంసవాహనంపై ఊరేగుతున్న ఆంజనేయస్వామి

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వరుడి తెప్పోత్సవం

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు స్వామివారి ఉత్సవమూర్తులను శేష వాహనంపై భాజభజంత్రీలు, మేళ తాళాలతో ఊరేగించారు. ఆలయ ఆవరణలోని పుష్కరిణిలో స్వామివారు తెప్పోత్సవంపై విహరించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ టంగుటూరి శ్రీను ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటుచేశారు. అనంతరం స్వామివారిని శేషవాహనంపై దశమికట్ట వరకు ఊరేగించి తిరిగి దేవాలయం చేరుకున్నారు. ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యచంద్రారెడ్డి, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పుష్కరిణిలో హంస వాహనంపై విహరిస్తున్న ఆదిశిలావాసుడు

బొల్గట్‌పల్లిలో దొంగల బీభత్సం




ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం సభ్యులు

అచ్చంపేట రూరల్: మండలంలోని బొల్గట్‌పల్లిలో శుక్రవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో కొందరు వలసలు వెళ్లిన వారి ఇళ్లను, రాత్రివేళ పంటపొలాల్లో నిద్రించిన రైతుల ఇళ్లను దొంగలు టార్గెట్ చేసుకొని చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలోని ఎనిమిది ఇళ్లలో దొంగతనం చేశారు. ఇళ్ల తలుపులకు ఉన్న తాళాలు విరగ్గొట్టి బీరువాలలో ఉన్న బంగారు, వెండి వస్తువులు, డబ్బులు అపహరించారు. శనివారం ఉదయం పొలాల నుంచి ఇంటికి వచ్చిన రైతులు ఇంటి తలుపు తెరిచి ఉండటంతో దొంగతనం అయినట్లు భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని చోరీ అయిన ఇళ్లను పరిశీలించారు. క్లూస్ టీం సభ్యులు వచ్చి వేలిముద్రలు, ఆధారాలను సేకరించారు. మూడావత్ శివ, మూడవత్ భీముడు, శీలం సంజీవ్‌ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


బావిలో పడి వృద్ధురాలి మృతి

- పాడెమోసిన ఎమ్మెల్యే మేఘారెడ్డి
- పరామర్శించిన ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి



బామిని (ఫైల్)

ఖిల్లాఘనపురం: మతిస్థిమితం లేని గిరిజన వృద్ధురాలు శుక్రవారం ప్రమాదవశాత్తు పాడుబడిన బావిలో పడి మృతి చెందింది. కుటుంబ సభ్యుల తెలిపిన వివరాలు.. రోడ్డుమీది తండాకు చెందిన బామిని(76) మతిస్థిమితం కోల్పోయింది. ఈ నేపథ్యంలో శుక్రవారం తండాకు సమీపంలోని పాడుబడిన బావిలో ప్రమాదవశాత్తు పడిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతకగా.. పాడుపడిన బావి వద్ద వృద్ధురాలి చేతికర్ర, అద్దాలు కన్పించాయి. బావిలో వెతకగా వృద్ధురాలి మృతదేహం బయటపడింది. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి తండాకు చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వృద్ధురాలి పాడె మోశారు. అనంతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.



పాడె మోస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

బావిలో పడి వ్యక్తి..

మల్దకల్: మద్యంమత్తులో ఉన్న వ్యక్తి ఇంటికి వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మూడురోజుల క్రితం బావిలో పడి మృతి చెందగా.. శనివారం వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటన మల్దకల్ గ్రామంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ గోపాల్ నాయక్ తెలిసిన వివరాల ప్రకారం.. మల్దకల్ గ్రామానికి చెందిన నక్క నర్సింహులు(37) తనకున్న కొద్దిపాటి వ్యవసాయ పొలంలో పంట సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మద్యానికి బానిసై ఈ నెల 11న మద్యం తాగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ప్రమాదవ శాత్తు బావిలో పడి మృతి చెందాడు. నర్సింహులు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం బంధువులతో, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికారు. శనివారం నర్సింహులు కనిపించడం లేదని భార్య జయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి పోలీసులు వైన్‌షాపు పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వైన్ షాపుకు కొద్ది దూరంలో ఉన్న పాత బావిలో వ్యక్తి మృతి చెందిన విషయాన్ని గుర్తించారు. మృతదేహాన్ని బయటకు తీయగా, మృతుడు నక్క నర్సింహులుగా గుర్తించారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

కల్తీ పదార్థాల సీజ్



సంతోష్ ఫుడ్స్‌లో సీజ్ చేసిన ఆహార పదార్థాలు

పాలమూరు: రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు రోహిత్ రెడ్డి, శ్రీశిక, జగన్నాథం, శివశంకర్‌రెడ్డిల బృందం శనివారం పట్టణంలోని ఏనుగొండలో ఉన్న సంతోష్ ఫుడ్స్ మ్యానిఫ్యాక్చరింగ్ యూనిట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసింది. చిప్స్, నంకిన్స్, వేయించిన పల్లీలు, కారామిక్చర్‌తోపాటు ఇతర ఆహార పదార్థాల్లో నాణ్యత లేకపోవడంతో రూ.60,500 విలువ చేసే వాటిని సీజ్ చేశారు. ఫుడ్‌సేఫ్టీ ప్రమాణాల చట్టం 2006 ప్రకారం కాలం చెల్లిన లైసెన్స్ నంబర్ పదార్థాలపై ముద్రించి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఆహార ఉత్పత్తులపై తయారీ, గడువు డేట్, బ్యాచ్ నంబర్, లేబులింగ్ వివరాలు ఏవీ లేవని, ప్రమాదకరమైన యూరియా బ్యాగుల్లో ఆహార పదార్థాలు నిల్వ చేయడంతో అప్పటికప్పుడు వాటిని ధ్వంసం చేయడంతో పాటు మిగిలిన వాటిని సీజ్ చేశారు. స్టోర్ రూంలో నాసిరకమైన పిండి, ముడి ఆహార పదార్థాలు భారీగా ఉండటం గుర్తించి నోటీసులు అందించారు. రూ.26 వేల రీయూజ్డ్ ఆయిల్, ఫంగల్ ఇన్‌ఫెక్షన్‌తో కూడిన ఆలుగడ్డలు, పల్లీలను ధ్వంసం చేశారు. ఆహార పదార్థాల తయారీలో కృత్రిమ రంగులు వాడుతున్నట్లు గుర్తించి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించారు.

- పిస్తా హౌజ్‌లో చేసిన తనిఖీల్లో భాగంగా పూర్తిగా అపరిశుభ్రమైన వాతావరణం చూసి నోటీసులు ఇచ్చారు. స్టోర్ రూంలో ఎలుకలు కొరికి ఉన్న ఆహార పదార్థాలతోపాటు రొడెంట్ ఇన్‌ఫెక్షన్‌తో కూడిన ఆప్రికాట్స్ డ్రైఫ్రూట్స్ గుర్తించి ధ్వంసం చేశారు. అలాగే 160 కిలోల కల్తీ టీ పౌడర్, 3 కిలోల యాలకులను సీజ్ చేసి శాంపిల్స్ సేకరించారు. భారీగా నిల్వ చేసిన మాంసం గుర్తించారు. కిచెన్‌లో డ్రెయినేజీ పేరుకుపోవడంతో ఈగలు, ఇతర కీటకాలు ఆహార పదార్థాలపై వాలడంపై మరో నోటీసు అందించారు. పది రోజుల్లో తప్పులు సరిచేసుకోకపోతే పిస్తాహౌజ్‌ను శాశ్వతంగా సీజ్ చేస్తామని హెచ్చరించారు. అలాగే సంతోష్ ఫుడ్స్, పిస్తా హౌజ్ యాజమాన్యాలు ఎఫ్‌ఎస్‌ఎస్ యాక్ట్ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తున్న నేపథ్యంలో నోటీసులు, ఇంప్రూవ్మెంట్ నోటీసులు జారీచేశారు. ఈ సందర్భంగా జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ కొందరు వ్యాపారులు ఆహార పదార్థాలను తయారు చేసి, విక్రయించే క్రమంలో అధిక మోతాదులో రంగులు వినియోగించడం, మోతాదుకు మించిన ప్రిజర్వేటివ్స్, ప్రమాదకరమైన అజినోమోటో లాంటి టెస్టింగ్ సాల్ట్‌ను కలిపి అనారోగ్యకమైన ఆహారం అందిస్తున్నారని చెప్పారు. కిచెన్లు అపరిశుభ్రంగా ఉండటంతోపాటు అనారోగ్యకరమైన పరిసరాల్లో ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారని ఆరోపించారు. రంగులు వాడటం, గడువు ముగిసిన పదార్థాలను ఉపయోగిస్తున్నారని, అతి తక్కువ సమయంలో అధిక లాభార్జన కోసం ఆహారాన్ని కల్తీ చేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కల్తీ ఆహారంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కోరారు.

ఆభరణాలు చోరీ

గద్వాల క్రైం: మహిళల మెడలో బంగారు ఆభరణాలు చోరీ చేసిన సంఘటన శుక్రవారం రాత్రి గద్వాల పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. మల్దకల్ మండలం కుర్తిరాల్ చెరువ్వ గ్రామానికి చెందిన తబిత, సత్యమ్మలు శుక్రవారం పని నిమిత్తం గద్వాలకు వచ్చారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో గద్వాల బస్టాండ్‌లో అయిజ బస్సు ఎక్కేందుకు వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని దుండగులు ఇద్దరి మెడలోని బంగారు ఆభరణాలను అపహరించారు. తబిత మెడలోంచి అరతులం, సత్యమ్మ మెడలోంచి తులం బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనపై బాధితురాలు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.